శతాధిక చర్చి.. ఘనమైన కీర్తి

- నంద్యాల హోలీక్రాస్ కెథడ్రల్ చర్చికి ఘనమైన చరిత్ర
- వందేళ్లు దాటినా చెక్కుచెదరని కట్టడాలు, ఫర్నిచర్
- ఘనంగా 119వ చర్చి ప్రతిష్ఠ వేడుకలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలలోని హోలీక్రాస్ కెథడ్రల్ చర్చికి ఘనమైన చరిత్ర ఉంది. 1905లో ఫిబ్రవరి 8వ తేదీన ప్రతిష్ఠించబడి 118ఏళ్ల పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజులపాటు ఆలయ 119వ వార్షికోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నారు.

ఆలయ నిర్మాణ పూర్వ చరిత్ర...

1855లో లండన్ మిషనరీలు ఎస్పీజీ ఒక స్వచ్ఛందను స్థాపించాయి. మొట్టమొదట నంద్యాల కుందూనది పరివాహక ప్రాంతాన్ని ఎంచుకొని ఉత్తర దిక్కున నిర్మించారు. నాడు అక్కడ పేద ప్రజలకు విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన నిర్మాణం అకాల వరదల వల్ల ముంపునకు గురైంది. వరదల వల్ల ప్రాణనష్టం సంభవించింది. అనుకూల ప్రాంత కానందున అక్కడ నుంచి ఎస్పీజీ మిషన్ వారు ప్రస్తుతం ఉన్న ఎస్పీజీ పాఠశాల ప్రాంతంలో ఒక పెద్ద గుడిసె వేశారు. అక్కడే ఉన్న విద్యార్థులకు చదువు, ప్రార్థనలు చేసేవారు.

ప్రస్తుత ఆలయ చరిత్ర...

ఇంగ్లాండ్ నుంచి నంద్యాలకు మిషనరీగా వచ్చిన రెవ. ఆర్థర్ ఇన్‌మన్ 1902 జూన్ 26న హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి నిర్మాణానికి పునాది వేశారు. నిర్మాణానికి వాడే రాళ్లను నంద్యాల సమీపంలోని పులిమద్ది గ్రామ సమీపం నుంచి ఎడ్ల బండ్లలో తీసుకొచ్చారు. సున్నము, ఇసుక, గుడ్ల మిశ్రమంతో అనేక సార్లు ఎద్దులతో తిప్పి(గానుగ) కట్టడం చేపట్టారు. ఈ మిశ్రమము(మోర్టర్) ఎంతో పటిష్టంగా ఈ మహాదేవాలయాన్ని నిర్మించారు. ఈ చర్చిని మద్రాసులో నుంచి వచ్చిన తమిళవాసి అంబ్రోస్ పర్యవేక్షణలో నిర్మించారు.

యేరుషలేంలోని చర్చి నిర్మాణ శైలిలో..

ఆలయ గోపురం యేరుషలేంలోని చర్చి నిర్మాణ శైలిని పోలియున్నదని చరిత్రకారులు చెబుతారు. మిషనరీ లు ఉష్ణ ప్రాంతంగా గుర్తించి ఆలయంపై కప్పు దాదాపు 35 అడుగుల ఎత్తులో, కేరళ నుంచి తెచ్చిన ఎర్రటి రంగులతో ఉన్న పెంకులతో కప్పబడింది. అంతేగాక పైకప్పు నిర్మాణానికి బర్మా టేకును ఉపయోగించారు.

చెక్కుచెదని ఫర్నిచర్

ఆలయంలో నేటికి వాడుతున్న ఫర్నిచర్, దైవారాధనకు వాడబడే దీప స్తంభాలు, సిలువ, క్వయర్ స్టాల్, ప్రసంగ పీటిక, బిషప్ పీఠము, గురువుల చైర్ తదితర వాటిని ఇప్పటికీ ఎంతో అందంగా చెక్కుచెదరకుండా ఉన్నాయి.

బాప్తీస్మపు తొట్టి..

బాప్తీస్మపు తొట్టి ఏకశిలతో తయారు చేశారు. దీనిని దేవశిఖామణి వారి సతీమణి జ్ఞాపకార్థం ఆలయంలో ఏర్పాటు చేశారు. బాప్తీస్మపు తొట్టి ద్వారా లక్షలాది మందిని సంఘ గురువులు, బిషపులు బాప్తీసం ఇచ్చారు.

దేశ నాయకులు, ప్రజల కోసం నిత్యం ప్రార్థనలు

ఆలయంలో ప్రతి రోజూ ఉదయం సాయంత్రం వేళలో మనదేశ రాష్ట్రపతి, దేశ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, దేశనాయకుల క్షేమం కొరకు, మంచి పరిపాలన కొరకు, ప్రజల సుఖ సంతోషాలు, అభివృద్ధి కొరకు నిత్యం ప్రార్థనలు చేయడం ఇక్కడ విశేషం.



హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి

500 కేజీల చర్చి బెల్..

చర్చి బెల్ లండన్ నుంచి నౌక ద్వారా మిషనరీలు తెప్పించి ఏర్పాటు చేశారు. బెల్ బరువు దాదాపు 500కేజీలకు పైగా ఉంది. ఈ బెల్ శబ్దం గతంలో 20 కి.మీ పరిధిలోని గ్రామాలకు వినబడేది. అప్పట్లో ఈ గంట శబ్దంతోనే సమయం తెలుసుకునేవారు.

పచ్చదనం, పర్యావరణం..

పచ్చదనం, పర్యావరణానికి ఈ ఆలయం నిలయము. అనేక మొక్కలు, 80సంవత్సరాల వయస్సు కలిగిన మహావృక్షాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. ప్రధాన ద్వారం ఇరువైపులా రెండు ఏనుగు మర్రి మహా వృక్షాలు స్వాగతం పలుకుతున్నట్లు, అవి క్రైస్తవులై అది పితరులైన ఆదాము, హవ్వలుగా పిలువబడుతాయి. అనేక మొక్కలు, ఇశ్రాయేలు దేశంలో లభించే వొలీవ చెట్లు, అన్జూరపు చెట్లు ఉన్నాయి.

సేవలందించిన 20 మంది బిషప్‌లు

ఆలయంలో పీఠాధి పతులుగా 20మంది బిషప్‌లు సేవలందించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా డి.రైట్.రెవ.డాక్టర్ వరప్రసాద్ పీఠాధిపతిగా సేవ నిర్వహిస్తున్నారు.

సామాజిక సేవ...

పేద అంధ విద్యార్థులకు ఆర్థిక సహాయం, పేదవారికి క్రిస్మస్ సందర్భంగా ప్రతి ఏటా 500మందికి వస్త్ర దానం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వితంతువులకు, వికలాంగులకు, వృద్ధులకు నెలనెలా పింఛన్ సౌకర్యం, వివిధ గ్రామాల నుంచి నంద్యాల ఎస్పీజీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సాయం, కుష్టు వ్యాధి గ్రస్తులకు వస్త్రదానం చేసేవారు. రాయలసీమలో నంద్యాలకు తలమానికమైన ఈ మహా ఆలయాన్ని కుల మతాలకు అతీతంగా దర్శించుకొని మానసిక ప్రశాంతత, ధార్మిక చింతన, ప్రభువు ఆశీర్వాదం పొందవచ్చన్నారు.

క్లుప్తంగా

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు



క్రీడాకారులతో సర్పంచ్

శిరివెళ్ల: ఆడుదాం ఆంధ్ర పోటీలలో పాల్గొన్న యర్రగుంట్ల క్రీడాకారులకు సర్పంచు అయ్యలూరి సుభహాన్ ప్రోత్సాహకాలు అందజేశారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో వాలీబాల్, బ్యాడ్మింటన్ నియోజక వర్గ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు రూ. 10వేలు విలువ చేసే టీ షర్టులు, రూ. 3 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, ఈట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్ కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న జమాతే ఇస్లామిక్ హింద్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జమాతే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కార్యాలయంలో యాంటీ డ్రగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సమద్ మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు 11 రోజుల పాటు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కమిటీలో కన్వీనర్లుగా ముస్తఫా, అబుబకర్, అబ్దుల్ అలీం, బేగం అంతుసాలా, కో కన్వీనర్లుగా అబీద్, సాజిత్, మహబూబ్, అబ్దుల్లాలను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జకారియా, మోమిన్, పజ్‌లేహత్, జిలాని, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



ఇండస్ట్రియల్ విజిట్ లో పాల్గొన్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని క్రాంతి నగర్‌లో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులకు వృత్తి విద్య నైపుణ్య శిక్షణలో భాగంగా బుధవారం ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మల్లికార్జునప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ విజిట్ల వల్ల ఆచరణాత్మక జ్ఞానం పెంపొందుతుందన్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని క్రాంతి నగర్‌లో ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సందర్శించారని చెప్పారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ వృత్తి విద్య కోర్స్ శిక్షకులు శంకర్‌రావు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వీధి కుక్కల నుంచి కాపాడాలి

నంద్యాల(సిటీ): పట్టణంలో దోమలు, వీధి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డికి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో విపరీతంగా పెరుగుతున్న దోమలు, వీధి కుక్కల దాడుల పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎస్ఐ చర్చి 20వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న సంఘ కాపరి రెవ.సుగుణపాల్

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు పంచాయతీ మజరా గ్రామమైన జ్ఞాపురంలోని సీఎస్ఐ చర్చి 20వ ప్రతిష్ఠ దినోత్సవాన్ని బుధవారం చర్చి పెద్దలు తలారి దేవరాజు, జేష్ఠాది లాజర్, కాకర్లపల్లె పుల్లన్న, అన్నవరం చిన్న ఓబులేసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో సంఘ కాపరి రెవ.సుగుణపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చికి నిరంతరం సేవలందిస్తున్న సంఘ కాపరి రెం.సుగుణపాల్‌ను చర్చి పెద్దలు, భక్తులు దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రెవ.జాన్ ప్రభాకర్‌తో పాటు మరికొందరు క్రైస్తవ గురువులు పాల్గొన్నారు.

చెంచుగిరిజనులకు గ్రూప్-1లో ఉచిత శిక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: గ్రూప్-1 పోటీ పరీక్షలను రాయబోతున్న చెంచుగిరిజనులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి బుధవారం తెలిపారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో నివసిస్తున్న, గ్రూప్-1 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న చెంచుగిరిజన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు గ్రూప్-1 రిజిస్ట్రేషన్ ఫారం, ఆధార్‌కార్డ్, కులధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ జతచేసి ప్రాజెక్ట్ అధికారి, శ్రీశైలం ఐటీడీఏ, శ్రీశైలం కార్యాలయానికి పంపాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నంద్యాల క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 9 నుంచి 13వ తేది వరకు విశాఖపట్నంలో జరిగే ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు నంద్యాలకు చెందిన 57 మంది పురుష క్రీడాకారులు, 50 మంది మహిళా క్రీడాకారులు, 13 మంది కోచ్‌లు వెళ్లినట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, ఆడుదాం ఆంధ్ర జిల్లా నోడల్ ఆఫీసర్ శివకుమార్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు నంద్యాల జిల్లా నుంచి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు మూడు ఆర్టీసీ బస్సుల్లో పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియం నుంచి బయల్దేరారన్నారు.

90.54శాతం కులగణన సర్వే పూర్తి

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో 90.54 శాతం కులగణన సర్వే పూర్తయినట్లు డీఎల్‌డీఓ మురళీకల్యాణి బుధవారం తెలిపారు. ఇప్పటి వరకు 5,63,630 గృహాలు 14,83,119 మందికి సంబంధించిన కులగణన సర్వే పూర్తయ్యిందన్నారు. సకాలంలో సర్వే పనులు పూర్తయ్యేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

మదార్‌స్వామి హుండీ ఆదాయం రూ. 2.36లక్షలు

మహానంది: నందిపల్లె గ్రామంలోని మహిమాన్వితమైన మదార్‌స్వామి దర్గాలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన హుండీ కానుకల లెక్కింపులో రూ.2,36,354 ఆదాయం వచ్చింది. నగదుతో పాటు మూడు వెండి గొడుగులు, రెండు వెండి, ఆరు ఇత్తడి గుర్రాలను భక్తులు స్వామివారికి సమర్పించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎనిమిది నెలలకు ఈ మేరకు ఆదాయం వచ్చినట్లు వివరించారు.

పనుల గుర్తింపు పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

రుద్రవరం: ఉపాధిహామీ పథకం కింద పనుల గుర్తింపు ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆ శాఖ ఏపీడీ సాంబశివరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రామచంద్రతో కలసి ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రాక ముందే పనులను గుర్తించాలన్నారు. అలాగే రైతులకు అవగాహన కల్పించి పండ్ల తోటల పెంపకం దృష్టి సారించేలా చూడాలని సూచించారు. మండలంలో దాదాపు 400 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేలా కృషి చేయాలని చెప్పారు. కూలీలకు మెరుగైన వేతనం వచ్చేలా పనులు గుర్తించాలని, ఎన్నికల కోడ్ వచ్చాక జిల్లా కలెక్టర్ అనుమతులు పొందిన పనులను మాత్రమే చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ ప్రతాప్, ఇతర సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



7వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం పారిశుద్ధ్య వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని 7,8వ వార్డులు, పద్మావతి నగర్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పట్టణంలోని వీధులు, మురుగు కాల్వల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలని సిబ్బందని ఆదేశించారు. మురుగు కాల్వల వెంట ఎక్కడైనా పిచ్చిమొక్కలు ఉంటే ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అదేవిధంగా వార్డులలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి సారించాలి

గోస్పాడు: పోలింగ్ కేంద్రాలల్లో వసతులపై ఎలక్టోరల్ అధికారులు దృష్టి సారించాలని తహసీల్దార్ భార్గవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 40 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ భార్గవి, డీటీ విజయశేఖర్ జిల్లెల్ల, యాళ్లూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనసూయ, ఎంఈఓ అబ్దుల్ కరీమ్, ఏఈ రాజశేఖర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లెల్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భార్గవి

రేపు నులిపురుగు నివారణ కార్యక్రమం

శిరివెళ్ల: ఈ నెల 9వ తేదీన జాతీయ నులి పురుగు నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ పిలుపునిచ్చారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టర్లు, కరపత్రాలను ఏంపీపీ నాయక్ వసీంతో కలసి అవిష్కరించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఏడాది నుంచి 19 ఏళ్ల బాలబాలికలు 4.10 లక్షల మంది ఉన్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. పగటి పూట మధ్యాహ్న భోజనం అనంతరం 10-12 ఏళ్ల పిల్లలకు అర టాబ్లెట్, 3-9 వయసు వారికి ఒక టాబ్లెట్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. శిరివెళ్ల మండలంలో 5,224 మందికి టాబ్లెట్‌ను అందచేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఈఓ ఆర్డీ నాగేంద్ర, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

మాత్రల పంపిణీకి సహకరించాలి

చాగలమర్రి: పిల్లల్లో నులి పురుగుల నివారణకు ప్రభుత్వం చేపట్టిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సహకరించాలని స్థానిక ప్రభుత్వ వైద్యులు షేక్ ఇమ్రాన్ తెలిపారు. ఫిబ్రవరి 9న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సుమారు 8,000 మాత్రలను ఎంఈఓ న్యామతుల్లాకు బుధవారం ఆయన అందజేశారు. అలాగే పోస్టర్లను స్థానిక ఎంపీడీఓ ఎస్.సూర్యనారాయణరెడ్డి, వైద్య సిబ్బందితో కలిసి విడుదల చేశారు.

నులిపురుగులను నివారిద్దాం

రుద్రవరం: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి నులిపురుగులను నివారిద్దామని ఎంపీడీఓ రామచంద్ర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి నవీన్‌తో కలసి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు.

ఉయ్యాలవాడ: ఈ నెల 9న చేపట్టనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ రఘురాం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారిణి అపర్ణ, ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డితో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు.

చెన్నైలో మల్లన్న కల్యాణం

శ్రీశైలంటెంపుల్: హిందూ ధర్మప్రచారంలో భాగంగా చెన్నైలో శ్రీశైల దేవస్థాన ధర్మప్రచార రథం ద్వారా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం రాత్రి చెన్నై, మాధవరంలోని కైలాసనాథర్ కోవెల్‌లో భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ కల్యాణోత్సవ సంకల్పాన్ని పఠించారు. స్వామి,అమ్మవార్లను వస్త్రాలు సమర్పించి బాసిక ధారణ చేశారు. అనంతరం గౌరీపూజ జరిపించి స్వామిఅమ్మవార్ల కల్యాణ తంతు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను, ఆశీర్వచనాన్ని అందించారు.



చెన్నైలో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం

గడ్డి వామి దగ్ధం

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ప్రమాద వశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో శీలం చెంచు శేఖర్ అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధమయ్యింది. ఈ ప్రమాదంలో బాధిత రైతుకు రూ.30,000ల నష్టం వాటిల్లింది. బాధిత రైతు సుమారు 200ల మోపుల వరిగడ్డితో ఇటీవల గడ్డి వామి ఏర్పాటు చేసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం ప్రమాద వశాత్తు గడ్డివామి వద్ద మంటలు చెలరేగడంతో అక్కడే ఉన్న కొంత మంది సమీపంలోని కుళాయి నుంచి నీరు తీసుకెళ్లి మంటలను ఆర్పేందుకు యత్నించారు. కొంత మంది ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందివ్వడంతో.. అగ్నిమాపక వాహనంతో సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పి వేయటంతో పక్కనే ఉన్న గడ్డివాములకు ప్రమాదం తప్పింది.

రేపు చాకరాజువేములలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. పల్లెవాసుల ఆరోగ్యం మెరుగు పరేచేందుకు ప్రభుత్వం వైద్య నిపుణులచే ఆరోగ్య సురక్ష ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానికుల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

10న పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 10, 11వ తేదీలు సెలవు దినాలు కావున ఆ రోజుల్లో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఈఓ సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏ పాఠశాలలో అయినా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే ఆ యాజమాన్యం పై చర్యలు తీసుకుంటామన్నారు. డీప్యూటీ ఈఓ, ఎంఈఓ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు బుధవారం నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన ఉపాధ్యాయులను, చంటి పిల్లల తల్లులను, గర్భిణి ఉపాధ్యాయినిలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శులు మునిస్వామి, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులను సరి చేస్తాం

- చాలెంజ్ ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తాం
- జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: తుది ఓటర్ల జాబితాలోని తప్పులను సరి చేస్తామని జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఓటర్ల జాబితా, స్ట్రాంగ్ రూముల నిర్వహణ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలు సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకొని తప్పొప్పులను సవరిస్తామన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల మేరకు ఛాలెంజింగ్ ఓటింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపును శాంతిరాం ఫార్మసీ, ఇంజినీరింగ్ కాలేజీలకు బదులుగా ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేయవలసిందిగా పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరగా.. పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, వైఎస్సార్‌సీపీ నుంచి సాయిరాం రెడ్డి, బీజేపీ చంద్రశేఖర్, కాంగ్రెస్ సయ్యద్ రియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కర్రసాము సౌత్ ఇండియా ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ



కర్రసాము పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 4వ తేదీన నెల్లూరులో జరిగిన మొదటి సౌత్ ఇండియా ఛాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాల క్రీడాకారులు 8మంది ప్రతిభ చాటినట్లు నంద్యాల జిల్లా కర్రసాము అసోసియేషన్ మాస్టర్ అబ్దుల్ మజీద్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023-24 పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ పోటీల్లో మినీ సబ్‌జూనియర్ విభాగంలో అతిథి బంగారు పతకం, సబ్‌జూనియర్ విభాగంలో ప్రణీతేశ్వరరెడ్డి, మేఘన, అనప్రాజోయ, సింధు, రిష్యాస్రింగలు బంగారు పతకాలు, కాడెట్ విభాగంలో మహమ్మద్ ఉబేదుల్లా , సీనియర్ విభాగం కర్రయుద్ధంలో లో మాసుం బంగారు పతకాలు సాధించారన్నారు. వీరంతా నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హై స్కూల్ క్రీడా మైదానంలో శిక్షణ తీసుకున్నారని చెప్పారు. అధ్యక్షులు మారుతికుమార్, సెవెన్‌హిల్స్ హాస్పిటల్ సిబ్బంది క్రీడాకారులను అభినందించారు.

బాడీ బిల్డర్ పోటీల్లో విజేతకు సన్మానం

రాష్ట్రస్థాయి బాడీబిల్డర్ పోటీల్లో మొదటిస్థానం సాధించిన ముకుందను బుధవారం నంద్యాల పట్టణంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆంధ్రబాడీ బిల్డర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో ఫిబ్రవరి 4న జరిగిన పోటీల్లో 75 కిలోల విభాగంలో మొదటిస్థానం సాధించి ఓవరాల్ విజేతగా నిలిచాడని డీవైఎఫ్ఐ కార్యదర్శి శివ తెలిపారు. నాయకులు బాలవెంకట్ కుమార్, రాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు

శిరివెళ్ల: జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మండలంలో ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో జగనన్న కాలనీలలో పేదలకు ఇళ్ల పట్టాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. దానికి సంబంధించి పూర్తి అధికారం కల్పించేందుకు ఉచితంగా రిజిస్ట్రేషన్లను సచివాలయాల ద్వారా చేసి ఇస్తోంది. మండలంలో 11 జగనన్న కాలనీలలో 2,230 మంది లబ్ధిదారులను సచివాలయాలకు పిలిపించి ప్రక్రియ మొదలు పెట్టారు. ఇప్పటి వరకు 554 మంది లబ్ధిదారులకు సంబంధించి రిజిస్ట్రేషన్ పూర్తియింది. త్వరలో వారికి సర్వ హక్కుల పట్టాలను అందజేయనున్నారు. గ్రామాల వారీగా.. శిరివెళ్లలో 118, యర్రగుంట్ల 64, గోవిందపల్లె 121, కోటపాడు 9, గంగవరం 50, వనికినిదిన్నె 50, బోయలకుంట్ల 26, చెన్నూరు 23, గుండంపాడు 59, జీనేపల్లె 24, మహదేవపురంలో 14 మంది లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తియింది.



శిరివెళ్ల -2 సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ

712 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు పూర్తి

నంద్యాల(అర్బన్): మండల పరిధిలో ప్రభుత్వం 1,048 ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిందని, అందులో ఇప్పటి వరకు 712 పట్టాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని ఈఓఆర్డీ మహిధర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇప్పటివరకు 67 శాతం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు జరిగాయని, మిగిలిన 217 పట్టాలకు సకాలంలో పూర్తయ్యేలా సచివాలయ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు.

తాగునీటి పథకాలకు రూ.5.40 లక్షలు

ఉయ్యాలవాడ: రానున్న వేసవికాలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా గ్రామాల్లో మండల పరిషత్ నిధుల నుంచి రూ.5.40 లక్షలతో పైపులైన్, ఇతర పనులు చేపట్టనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆర్.పాంపల్లె గ్రామంలో రూ.2.50 లక్షలు, బోడెమ్మనూరు రూ.1.70 లక్షలు, హరివరం రూ.1.20 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు.

మోదీ క్యాంటీన్ ఏర్పాటుకు అనుమతివ్వండి

నంద్యాలటౌన్: నంద్యాల సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో పేద ప్రజలకు ఆకలి తీర్చేందుకు మోదీ క్యాంటీన్ ఏర్పాటు కోసం బుధవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు జిల్లా కలెక్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు అభిరుచి సేవా సమితి ద్వారా ఉచిత భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇందుకు కలెక్టర్ శ్రీనివాసులు స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొట్టె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.